ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 36.5
కనిష్ఠం 25.0
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
7
గురువారం 13 జూన్ 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుత	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.70 (122.8483)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.30 (2.57)	321	84
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	100 (0.76)	నిల్	నిల్

చికెన్ ధరలు | లైవ్ :రూ.180 | డ్రెస్ :రూ.250 | స్కిన్‌లెస్ : రూ.280

వడివడిగా బడికి

» పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభం » తొలిరోజునే ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేత » విద్యార్థులకు అక్షరాభ్యాసం



భువనగిరిలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న టీచర్లు

భువనగిరి టౌన్, జూన్ 12: వేసవి సెలవుల అనంతరం పండుగ వాతావరణంలో బుధవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. తొలిరోజున విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యారు. మామిడి తోరణాలు, రంగవల్లులు, జాతీయ నాయకుల ఫొటోలతో పాఠశాలలను అలంకరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికి ఉత్సాహపరిచి చాక్లెట్లు అందజేశారు. అలాగే ప్రభుత్వపాఠశాలల్లో తొలిరోజున హాజరైన పిల్లలందరికీ ఉచిత పాఠ్యపుస్తకాలు, ఒక జత యూనిఫాం అందజేశారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించారు. వేసవి సెలవుల ముచ్చట్లతో జిల్లాలోని 711 ప్రభుత్వ పాఠశాలలు, 251 ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు సందడి చేశారు. సుమారు 50రోజుల అనంతరం ఉపాధ్యాయులు, విదార్థులు కలుసుకొని ఉత్సాహంగా గడపడంతో తొలిరోజున పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో 42వేల మంది విద్యార్థులకు సుమారు 55 శాతం, ప్రైవేటు పాఠశాలల్లో 45వేల మంది విద్యార్థులకు సుమారు 35శాతం విద్యార్థులు తొలిరోజున హాజరయ్యారు. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఈ నెల 19నుంచి ప్రా రంభం కానున్నాయి. ఈ నెల 3వ తేదీ నుంచి 19 వరకు నిర్వహిస్తున్న బడిబాటలో భాగంగా తొలిరోజున అక్షరాభ్యాసం నిర్వహించారు. అయితే కొరత కారణంగా కొన్ని పాఠశాలల్లో సరిపడా యూనిఫాం,పాఠ్యపుస్తకాలు అందజేయలేదని సమాచారం.

సమస్యల తోరణం

తొలిరోజున ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలల్లో కూడా సమస్యల తోరణాలు విదార్థులకు స్వాగతం పలికాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులలేమి, ప్రతిపాదిత అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో మెజార్టీ పాఠశాలల్లో వేసవి సెలవుల పూర్వం, అనంతరం యథావిధిగా దర్శనమివ్వడంతో విద్యార్థులు కాస్త నిరుత్సాహానికి గురయ్యారు. అయితే పలు ప్రైవేటు పాఠశాలల్లో కూడా అర్హులైన బోధనా సిబ్బంది లేకపోవడం, కనీస మౌలిక వసతులైన సరిపడా తాగునీరు, మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థుల కష్టాలు ప్రారంభమయ్యాయని తల్లిదండ్రులు వాపోయారు.

రహదారులపై స్కూల్ బస్సులు, ఆటోల సందడి

పాఠశాలలు తెరుచుకోవడంతో రహదారులపై స్కూల్ బస్సులు,ఆటోల సందడి ప్రారంభమైంది. తొలిరోజున ప్రయాణిస్తూ విద్యార్థులు చేసిన సందడితో కోలాహలం నెలకొన్నది. పిల్లలను వాహనాల్లో ఎక్కిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బైకులు, కార్లు తదితర సొంత వాహనాల్లో పిల్లలను పాఠశాలల వద్ద దిగబెడుతూ తల్లిదండ్రులు హడావుడి చేశారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు బడిబాట ద్వారా కొనసాగుతుండగా, విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం తొలిరోజు నుంచే ఫీజులుం ప్రారంభమైంది. పిల్లల భవిష్యత్‌పై తల్లిదండ్రులకున్న ఆశలను ఆసరా చేసుకుంటున్న ప్రైవేటు యాజమాన్యాలు అడ్మిషన్, ట్యూషన్‌ఫీజులు వసూలు చేశాయి.



పదోన్నతులు, బదిలీలు ఘరానా..

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. మల్టీజోన్-2లో పదోన్నతుల స్టేను ఉన్నత న్యాయస్థానం ఎత్తివేయడంతో టీచర్ల పదోన్నతులకు మార్గం సుగమమైంది. మల్టీజోన్1లో జూన్ 8 నుంచి 22వరకు ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక నేపథ్యంలో జిల్లాలో ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు కొంత ఆటంకం కలిగింది. ఎన్నికల్ కోడ్ ముగియడంతో జిల్లాయంత్రాంగం ప్రభుత్వ ఆదేశాల మేరకు పదోన్నతులు,బదిలీలపై కసరత్తు ప్రారంభించింది.కోర్టు కేసులతో గతంలో ఎక్కడైతే ప్రక్రియ నిలిచిపోయిందో...మళ్లీ అక్కడి నుంచే ప్రారంభించారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

» విద్యాశాఖలో కోలాహలం
» ఎన్నికల్ కోడ్ ముగియడంతో కసరత్తు
» కేటగిరీలవారీగా జాబితా రూపకల్పన
» జిల్లాలో దాదాపు 620మందికి పదోన్నతి
» వీరిలో 70 మంది స్కూల్ అసిస్టెంట్ నుంచి జీహెచ్‌ఎంలుగా..
» 550 మంది ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్‌ల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి
» 2,130 మంది ఉపాధ్యాయుల బదిలీ

టెట్‌తో సంబంధం లేకుండానే ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది. ముందుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, అనంతరం బదిలీలు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకనుగుణంగా జిల్లా యంత్రాంగం సీనియార్టీ జాబితా రూపకల్పనలో నిమగ్నమైంది. ఈ ప్రక్రియ పూర్తయితే జిల్లాలో గెజిటెడ్ హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, లాంగ్వేజ్ పండిట్‌లు మొత్తం 620 మందికి పదోన్నతులు లభించనున్నాయి. జిల్లాలో మొత్తం 712 పాఠశాలలుఉన్నాయి. వీటిలో 481 ప్రాథమిక పాఠశాలలు, 68 ప్రాథమికోన్నత పాఠశాలలు, 163 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం ఉపాధ్యాయుల పోస్టులు 3,465 మంజూరుకు గానూ ప్రస్తుతం 2,800 మంది ఉన్నారు. మూడేళ్లలోపు ఉద్యోగ విరమణ చేయాల్సిన ఉపాధ్యాయులకు తప్పనిసరి బదిలీ నుంచి ప్రభుత్వం మినహాంపు ఇచ్చింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఉపాధ్యాయుల సీనియార్టీ ప్రకారం పదోన్నతులు పారదర్శకంగా చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటుంది. జీహెచ్‌ఎంల పదోన్నతి మల్టీజోన్ పరిధిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ చేపట్టిన కసరత్తులో స్కూల్ అసిస్టెంట్ నుంచి జీహెచ్‌ఎంలుగా జిల్లాలో 60నుంచి 70మంది పదోన్నతి లభించనుంది. అదేవిధంగా ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్(తెలుగు, హిందీ, ఉర్దు)ల నుంచి స్కూల్‌అసిస్టెంట్లుగా దాదాపు 550 మంది పదోన్నతి పొందనున్నారు. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి కానుంది.

పారదర్శకంగా పదోన్నతులు, బదిలీలు




ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని షెడ్యూల్ జారీచేసింది. ఈమేరకు అన్ని కేటగిరీల్లోని ఉపాధ్యాయులు సీనియార్టీ జాబితాను రూపొందిస్తున్నాం. జిల్లాలో దాదాపు 70మందికి స్కూల్ అసిస్టెంట్ నుంచి జీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించనుంది. అదేవిధంగా 550 మందికి ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్‌లను నుంచి స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టనున్నాం. మొదలు పదోన్నతులు, తర్వాత బదిలీలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- కె.నారాయణరెడ్డి, డీఈవో

2,130మంది ఉపాధ్యాయుల బదిలీ

ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియకు పచ్చజెండా ఊపడంతో జిల్లాలో భారీగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ కానున్నాయి. జిల్లాలో మొత్తం ఉపాధ్యాయుల పోస్టులు 3,465 మంజూరుకు గానూ ప్రస్తుతం 2,800మంది ఉన్నారు. ఇప్పటికే జిల్లాలో 665 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. జిల్లాలో గెజిటెడ్ హెడ్మాస్టర్లు, స్కూల్‌అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, లాంగ్వేజ్ పండిట్‌లు 2,130మంది దరఖాస్తు చేసుకున్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆప్షన్లను ఎంచుకున్నారు. అయితే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసే వరకూ మరిన్ని పోస్టులు ఖాళీ కానున్నాయి. ప్రభుత్వం కొత్తగా డీఎస్సీ వేయాలని నిర్ణయించింది. త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేసేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. డీఎస్సీ నోటిఫికేషన్‌లోపు జిల్లాలో ఉన్న ఉపాధ్యాయుల ఖాళీల సంఖ్యను జిల్లాయంత్రాంగం ప్రభుత్వానికి నివేదించనుంది.



ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ విద్య

» గ్రామీణ విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దాలి » ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



విద్యార్థినులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే

ఆలేరు రూరల్, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం ఆలేరులోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తయారు చేయడానికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తయారుచేసి పేదలకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం రోజున ప్రభుత్వం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించడం శుభపరిణామమన్నారు. బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో 314 పాఠశాలలు ఉండగా 249 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా మార్చామన్నారు. రూ.11.29 కోట్లతో పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. కలెక్టర్ హనుమంత్ కె జెండగే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పిన బెలూన్ల కథ పిల్లలను ఎంతగానో ఆకర్షించింది. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు స్థానిక డబుల్ బెడ్ రూం కాలనీని బీర్ల అయిలయ్య పరిశీలించారు. కాలనీవాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురికి నీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషర్ లక్ష్మీ, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిలను ఆదేశించారు. ఆలేరు, గుండాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు అయిలయ్య కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు.

ఆయా కార్యక్రమాల్లో డీఈవో నారాయణరెడ్డి, జడ్పీవైస్‌చైర్మన్ బీకూ నాయక్, ఎంపీపీలు గంధమల్ల ఆశోక్, చీర శ్రీశైలం, మునిసిపల్‌చైర్మన్ వస్పరి శంకరయ్య, వైస్‌చైర్మన్ మొరిగాడి మాధవి, హెచ్‌ఎం శ్యామ సుందరి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో జంగిటి కృష్ణ, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్, తదితరులు ఉన్నారు.

బెస్ట్ అవైలబుల్ పథకం విద్యార్థుల ఎంపిక

బెస్ట్ అవైలబుల్ పథకం కింద గిరిజన అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ నేతృత్వంలో విద్యార్థుల ఎంపిక బుధవారం జరిగింది. మొత్తం 10 సీట్లకు 27 దరఖాస్తులకు 10మందిని డ్రాపద్ధతిన ఎంపిక చేశారు.

భువనగిరి రూరల్: సస్య రక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెం రైతు వేదికలో బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం పంటల సాగుకు సంబంధించి క్రాప్ బుకింగ్, పంటల వివరాల నమోదుపై వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అనురాధ, భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, ఏడీఏలు భూక్య దేవ్‌సింగ్, వెంకటేశ్వర్‌రావు, పద్మావతి, ఏవో పావని ఉన్నారు.

కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్

బీబీనగర్: విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. బుధవారం మండలంలోని జమీలాపేట జడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో ప్రభుత్వ విద్యార్థులు రాణిస్తున్నారంటే ఆ ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో నాగవర్ధన్‌రెడ్డి, నోడల్ అధికారి సురేశ్ రెడ్డి, గ్రామ పెద్దలు సుభాష్ రెడ్డి, పాండురంగం గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పాఠశాల కమిటీ చైర్మన్ సునీత పాల్గొన్నారు.

స్వయంకృషితో లక్ష్యాలను చేరుకోవాలి : కలెక్టర్

భువనగిరి అర్బన్, జూన్ 12: విద్యార్థులు స్వయంకృషితో లక్ష్యాలను చేరుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ హనమంతు కే.జెండగే సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్‌కు మంచి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పదికి పది జీపీఏ సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 68మంది విద్యార్థులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వ్యక్తిగత వికాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రతీ విద్యార్థి దృష్టి సారించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. డీఈవో కే.నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థులకు స్ఫూర్తివంతమైందని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదికి పది సాధించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ రాష్ట్ర సభ్యుడు ఆర్. మహేందర్‌ఎడ్డి, సంస్థ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, డివిజన్ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి, డైరెక్టర్లు కొడాలి వెంకటేశ్, జంపాల అంజయ్య పాల్గొన్నారు.

నృసింహుడి దర్శనం
ఇక సులభతరం

» మరిన్ని క్యూలైన్లు.. భక్తులకు సదుపాయాలు » పాత సంప్రదాయాల పునరుద్ధరణ
» ఎండ, వానల నుంచి రక్షణ ఏర్పాట్లు » యాదగిరిగుట్ట ఆలయ అధికారుల సమీక్షలో విప్ బీర్ల



ఈవో క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల

భువనగిరి అర్బన్, జూన్ 12: యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చే భక్తులకు లక్ష్మీనృసింహుడి దర్శనం సులభతరం చేసేందుకు మరిన్ని సదుపాయాలను అందుబాటులోకి రానున్నట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. యాదగిరిగుట్ట కొండపై ఈవో క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొండపైన క్యూలైన్లు పెంచడంతో పాటు పాత సంప్రదాయాలను పునరుద్ధరిస్తామని, ఇందులో భాగంగా ఇప్పటికే ఎండ, వానల నుంచి భక్తులకు రక్షణ కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కొండపైకి భక్తులు చేరుకునేందుకు ఉచిత బస్సులు, ఆటోలు అందుబాటులో ఉన్నాయన్నారు. సుమారు 1000మంది భక్తులు నిద్రించేలా డార్మెటరీ హాల్ వసతి కల్పించామన్నారు. ఈ సంఖ్య ఇంకా పెంచే యోచన ఉందని, భక్తుల రద్దీకి అనుగుణంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రస్తుతం ఒక ఎస్కలేటర్ ఉండగా, మరొకటి ఏర్పాటుచేస్తామన్నారు.

ఐదువేల మందికి అన్నదానానికి సన్నాహాలు

కొండ కింద ఉన్న అన్నదాన సత్రంలో 1000మందికి ప్రతిరోజూ అన్నదానం చేస్తుండగా, 5వేల మందికి పెంచే యోచన ఉందన్నారు. ఇందుకోసం రూ.కోటి వ్యయంతో నిర్మించిన అన్నదాన సత్రంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆలయం ఉత్తర దిశలో ఉన్న షెడ్డును తొలగించి రథశాల ముందు నుంచి 25 అడుగుల వైశాల్యంలో గార్డెన్ నుంచి కొండకింద వైకుంఠ ద్వారం వరకు శాశ్వత షెడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీన స్వామివారి స్వాతి నక్షత్రం రోజున సుమారు ఐదు వేలమంది గిరిప్రదక్షిణ చేసేవిధంగా వైటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి నెల స్వాతి నక్షత్రం రోజు గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రభుత్వ అనుమతులతో అర్చకుల నియామకం చేయనున్నట్లు చెప్పారు. తిరుపతి తరహాలో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయగా కొండకింద వైకుంఠ ద్వారం చెంత కూడా మరో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి రోడ్డు మార్గంలో వచ్చే భక్తుల కోసం జాతీయ రహదారి అధికారుల అనుమతితో మరిన్ని సూచిక బోర్డులు, బాహుపేట స్టేజీ వద్ద స్వామివారి భక్తిని చాటిచెప్పే మూడు నామాలతో ఏర్పాటు చేస్తామన్నారు.

'స్థానిక' భక్తుల అంతరాలయ దర్శన వేళల మార్పు

యాదగిరిగుట్ట మండల వ్యాప్తంగా ప్రతీ శనివారం దర్శనం అవకాశం కల్పిస్తుండగా మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి 5.30గంటల వరకు ఉన్న దర్శన సమయాన్ని ఉదయం 8.30 నుంచి 9గంటల వరకు మార్చినట్లు చెప్పారు. కొండకింద వైకుంఠ ద్వారం దుకాణదారుల వినతి మేరకు వైకుంఠ ద్వారం నుంచి మెట్ల మార్గంలో అభివృద్ధి జరిగే క్రమంలో ఆలయ పునర్నిర్మాణంలో కోల్పోయిన 12 దుకాణాలు పునరుద్ధరించాలని ఈవోను ఆదేశించారు. ఇలాంటి సదుపాయాలు అందుబాటులోకి రాగానే భక్తుల రద్దీకి ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ఆలయానికి వచ్చే పిల్లలతో వచ్చే మహిళా భక్తులు తల్లి పాలు పట్టించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేస్తామన్నారు. ఆంజనేయస్వామి ఆలయం చెంత బొట్టు పెట్టడం, తీర్థం, శఠగోపం వంటి పాత సంప్రదాయాలు పునరుద్ధరించనున్నట్లు, కొండపైన ప్రధాన కార్యాలయం ఎదురుగా రెండు పడకల ఆసుపత్రి, పోలీసు అవుట్‌పోస్టు, కొండపైన బస్టాండ్ సమీపంలో 100నుంచి 200 మంది నిద్రించేందుకు అదనంగా డార్మెటరీ హాల్‌ను త్వరలో అందుబాటులోకి రానున్నట్లు విప్ ప్రకటించారు. ఈవో భాస్కరరావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆలయ రూపురేఖలు మారాయన్నారు. సమావేశంలో ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ప్రధానార్చకుడు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్‌కుమార్, పట్టణ ఇన్స్‌పెక్టర్ ఎం.రమేష్ పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ
అందరి బాధ్యత

సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి లత

భువనగిరి రూరల్, జూన్ 12: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి వి మాధవి లత అన్నారు. బుధవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ అధికారులు సమన్వయంతో పనిచేసి బాల కార్మికులను గుర్తించి పోలీస్‌శాఖకు సమాచారం అందజేయాలన్నారు. బాల కార్మికులులేని జిల్లాగా పేరు తేవాలన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలనుంచి ఉపాధికోసం వచ్చిన వారి సమాచా రం సంక్షేమ శాఖకు ఇవ్వాలని వివిధ పరిశ్రమల యజమానులకు సూచించామని, అయితే వారు సమాచారం సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ అయ్యన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరినాథ్, న్యాయవాదులు ఎస్.జైపాల్, జి.శంకర్, బాలల సంక్షేమ జిల్లా అధికారి సైదు లు, బం డి సాయన్న, శ్యాం, శివరాజ్, రాంబాయమ్మ ఉన్నారు.

భూసేకరణలో వేగం

● రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి 741 ఎకరాల సమీకరణ ● గ్రామాలవారీగా రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్న ఆర్డీవో



రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శేఖర్ రెడ్డి

చౌటుప్పల్ టౌన్, జూన్ 12: చౌటుప్పల్ డివిజన్‌లోని చౌటుప్పల్, వలిగొండ మండలాల్లో నిర్మించనున్న ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు రైతుల నుంచి 741 ఎకరాల భూసేకరణలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. ఆర్డీవో శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం గ్రామాలవారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి భూసేకరణకు సంబంధించి అవగాహన కల్పిస్తున్నారు. నష్ట పరిహారం వివరాలను వివరిస్తూ త్రిపుల్‌ఆర్ నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నారు. ఈ నెల 10న చౌటుప్పల్ మండలం తాళ్లసింగారం, 12న నేలపట్ల గ్రామాలకు చెందిన రైతులతో ఆర్డీవో సమావేశాలను నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరించారు. 14న చిన్నకొండూరు, 18న వలిగొండ మండలం ప్రొద్దటూరు, 20న పహిల్వాన్‌పురం, 22న గోకారం, 24న రెడ్లరేపాక, 26న వర్కట్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులతో సమావేశాలు నిర్వహిస్తారు. చౌటుప్పల్ మండలంలోని చౌటుప్పల్, తంగడపల్లి, లింగోజీగూడ గ్రామాలనుంచి సేకరించే భూములను ప్రభుత్వం నిర్ధారించింది. కానీ భూములకు చెల్లించే నష్టపరిహారాన్ని మాత్రం ఇంకా నిర్ణయించలేదు. 65వ నెంబర్ జాతీయ రహదారి వెంట ఉండే ఈ భూములకు త్వరలోనే నష్ట పరిహారాన్ని ప్రభుత్వం ఖరారు చేయనుంది.

భూసేకరణకు రైతులు సహకరించాలి: ఆర్డీవో

రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంకోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణకు రైతులు సహకరించాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామానికి చెందిన రైతులతో ఆర్డీవో శేఖర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో భూముల ధరలు పెరగడంతో పాటు దూర ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుందన్నారు. వేలాది ఎకరాలకు రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందని, ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కలుగుతుందని ఆర్డీవో అన్నారు. ఇదిలా ఉండగా, భూములను కోల్పోతున్న రైతులకు ఓపెన్ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సమావేశంలో తహసీల్దార్ హరికృష్ణ, సర్వేయర్ మురళీ, ఆర్ఐలు సురేందర్ శర్మ, సుధాకర్ రావులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూన్ 12 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో బుధవారం నిత్యకైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన జరిపారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవ చేపట్టారు. సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్టలోనూ నిత్యకైంకర్యాలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 28,32,118 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.


ఆలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అనుమానితుడికి దేహశుద్ధి

భువనగిరి రూరల్, జూన్ 12 : అనుమానాస్పదంగా గ్రామంలో తచ్చాడుతున్న వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం అనాజీపురంలో బుధవారం జరిగింది. రూరల్ ఎస్ఐ వారణాసి సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అయ్యాడపు ఉపేందర్‌రెడ్డి ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న భువనగిరి పట్టణం అర్బన్‌కాలనీకి చెందిన మారోళ్ల మారప్పను గ్రామస్థులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈ విషయమై రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో మారప్పను పోలీసులుస్టేషన్‌కు తరలించి విచారించగా తాను మద్యం మత్తులో తిరుగుతుండగా కొంతమంది తనను అనుమానించి దాడి చేశారన్నారు. తాను పని కోసమే ఆ గ్రామానికి వెళ్లానని తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు. తాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాకు చెందిన వాడినని, 15 ఏళ్ల కిందట భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన విజయలక్ష్మిని ప్రేమవివాహం చేసుకున్నానని తెలిపాడు. ఈ విషయమై భార్య విజయలక్ష్మికి సమాచారం ఇచ్చి ఆమెకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. గతంలో ఇతడిపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని రూరల్ ఎస్ఐ తెలిపారు.

రైలుపట్టాల పక్కన గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాడ్గులపల్లి, జూన్ 12: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడం-తిప్పర్తి గ్రామాల మధ్య రైలుపట్టాల పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ట్రాక్ పక్కన ఉన్న మృతదేహాన్ని సిబ్బంది గుర్తించి సమాచారం అందించారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సాలకమ్మ తెలిపారు. మృతుడి సుమారు 45 ఏళ్లు ఉంటాడని, వ్యక్తి రన్నింగ్ ట్రైన్‌లో నుంచి జారి పడి మృతి చెంది ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపారు.

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచక ముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ.. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

పనిచేసిన ఇంట్లోనే చోరీ

మిర్యాలగూడ, జూన్ 12 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో పని కోసం వచ్చిన కూలీలు ఇంటి యజమాని కళ్లు గప్పి నగదు, నగలు చోరీ చేశారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి చోరీకి పాల్పడిన ఇరువురు మహిళలను అరెస్టు చేశారు. బుధవారం మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వివరాలు వెల్లడించారు. స్థానిక రవీంద్రనగర్‌కు చెందిన కంచర్ల ఊర్మిల తన ఇంట్లో ఎనిమిది తులాల బంగారు నగలు, రూ.85 వేల నగదు చోరీకి గురైనట్లు ఈ నెల 5వ తేదీన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దొంగలు ఇంట్లోకి చొరబడినట్లు ఏఆధారం లభించకపోవడంతో రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ నరేష్‌లు కేసును పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. విదేశాల నుంచి తన కుమారులు తిరిగి వస్తున్నందున ఇంటికి పెయింటింగ్ వేయించేందుకు బాధితురాలు మే 30వ తేదీన అడ్డా కూలీలను పిలిపించినట్లు గుర్తించారు. విచారణలో స్థానిక హౌజింగ్ బోర్డుకు చెందిన ఇరువురు మహిళా అడ్డా కూలీలు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. వారి నుంచి సుమారు రూ.6 లక్షల విలువైన నగలు, నగదును స్వాధీనం చేసుకుని బుధవారం ఇరువురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.




దొంగతనం వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

గుట్కా విక్రయాలపై ఉక్కుపాదం

గుట్కా విక్రయాలపై ఉక్కుపాదం మోపే దిశలో వన్‌టౌన్ సీఐ సుధాకర్, ఎస్ఐ నరేష్‌లు సిబ్బంది సహాయంతో దాడులు చేసి పట్టణంలో పెద్ద ఎత్తున గుట్కా ప్యాకెట్లను నిల్వచేసిన ఇరువురు వ్యాపారులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. మెయిన్‌బజార్‌కు చెందిన గోపారపు రాజు, సీతారాంపురం ప్రాంతానికి చెందిన ఆకుతోట నర్సింహలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12.52 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుట్కా వ్యాపారుల అరెస్టులో కీలకంగా వ్యవహరించిన సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందజేస్తారని డీఎస్పీ తెలిపారు. గుట్కా వ్యాపారాలు నిర్వహించే వారు మానుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో వన్ టౌన్ పోలీసులు వెంకటేశ్వర్లు, నాగరాజ పాల్గొన్నారు.

తాటిచెట్లపై పిడుగులు



దామరచర్లలో ఎగిసి పడుతున్న మంటలు

దామరచర్ల / గుర్రంపోడు, జూన్ 12 : నల్లగొండ జిల్లా దామరచర్ల, గుర్రంపోడు మండలాల్లో తాటిచెట్లపై పిడుగులు పడ్డాయి. దామరచర్ల మండల కేంద్రంలోని వీర్లపాలెం రోడ్డులో బుధవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి భారీ శబ్ధంతో పొలాల్లోని ఎత్తులో ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడడంతో సుమారు 20 నిమిషాల పాటు మంటలు ఎగిసిపడ్డాయి. అదేవిధంగా గుర్రంపోడు మండలకేంద్రంలోని నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి కురిసిన వర్షంలో మండలకేంద్రం శివారులోని శాంతినగర్ వద్ద తాటి చెట్టుపై పిడుగు పడి మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. దీంతో ప్రధానరహదారిపై వెళ్తున్న వాహనదారులతో పాటు గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు తప్పవు

కొండమల్లేపల్లి, జూన్ 12 : నాటుసారా తయారుచేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తప్పవని నల్లగొండ దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు అన్నారు. దేవరకొండ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆంగోతుతండా, మంగ్యతండాలలో ప్రజలకు నాటుసారాతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆంగోతుతండాలో నాటుసారా తయారీకి ఉపయోగించే 500 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసంచేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు వీరబాబు, మల్లేశ్, నరసింహా, సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి కృష్ణ, నాగరాజు, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కోణంలోనే అవిశ్వాసం

- డీసీసీబీ చైర్మన్ మహేందర్ రెడ్డి



నల్లగొండ, జూన్ 12: తనపై రాజకీయ కోణంలో అవిశ్వాసం ప్రవేశపెట్టడం సమంజసం కాదని, ఈ అవిశ్వాసం వీగిపోవడం ఖాయమని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 25 ఏళ్ల వయస్సులోనే వంగపల్లి సింగిల్ విండో సొసైటీ నుంచి 400ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందానన్నారు. ఆరు పర్యాయాలు సొసైటీ చైర్మన్‌గా చేసి డబుల్ హ్యాట్రిక్ కొట్టానన్నారు. దివాళా తీసిన బ్యాంకును డీసీసీబీ చైర్మన్‌గా నాలుగున్నర ఏళ్లలోనే రూ.900కోట్ల నుంచి రూ.2400కోట్ల వరకు తీసుకవచ్చానన్నారు. దీని అంతటికి ప్రస్తుత పాలకవర్గ సభ్యులు, వైస్ చైర్మన్‌తో పాటు అధికారుల సహకారం కారణమన్నారు. మరో ఆరు నెలలోనే డీసీసీబీ రూ3వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకుంటుందని, అందుకు తాను శాయశక్తులా కృషి చేస్తానని, డైరెక్టర్లు సహకరించాలని కోరారు.

డైరెక్టర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినందుకే అవిశ్వాసం



క్యాంప్ నుంచి వీడియో సందేశంలో డైరెక్టర్లు

ఒంటెద్దు పోకడలతో డైరెక్టర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కాక అవినీతి, అక్రమాలకు పాల్పడినందునే తాము అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయం నుంచి డైరెక్టర్లతో కలిసి సమావేశంలో మాట్లాడిన వీడియోను మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేందర్‌రెడ్డి హుందాతనంతో ఉండకుండా ఎంసీ మీటింగ్‌లు, ఇతర సమావేశాలు పెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వైఖరిని మార్చుకోకపోతే సహించేది లేదన్నారు. ఆత్మగౌరవం కోసం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన డైరెక్టర్లను ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి



విక్రమ్(ఫైల్)

పెన్‌పహాడ్, జూన్ 12 : ఇసుక ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బుధవారం కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దోసపహాడ్ గ్రామానికి చెందిన కారింగుల రమేష్ ట్రాక్టర్‌పై జంగాలకాలనీకి చెందిన కడవంచి రమేష్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ట్రాక్టర్‌లో నిత్యం ఇసుక తరలిస్తుంటాడు. మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో దోసపహాడ్ మూసీనదిలో ఇసుకను లోడ్ చేసుకొని జంగాలకాలనీలో మూలమలుపు వద్ద ఆడుకుంటున్న పర్వతపు సైదులు-కోటమ్మ దంపతుల కుమారుడు విక్రమ్(10)ను అతివేగంగా ఢీకొట్టాడు. ట్రాక్టర్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడ్డ బాలుడిని సూర్యాపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలుడి మృతదేహం సూర్యాపేట జనరల్ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు కుటుంబ సభ్యులుతెలిపారు.ఈ ఘటనపై బుధవారం సాయంత్రం వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రవీందర్ తెలిపారు.

బుజ్జాయిలను బడికి పంపుతూ..



నల్లగొండలో షూలేస్ సరిచేస్తూ ఒకరు, స్కూల్ వద్ద దింపుతూ మరొకరు, బాలుడి తలదువ్వుతూ ఇంకొకరు... వాహనాలపై తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు



ఇండోర్ స్టేడియం ఆవరణ కబ్జాకు యత్నాలు

- అడ్డుకున్న మునిసిపల్, క్రీడల యువజన శాఖ సిబ్బంది
- కొందరు నేతలు, ప్రజాప్రతినిధుల ప్రమేయమున్నట్టు ప్రచారం
- ప్రహరీ లేకనే కబ్జాదారులకు అవకాశం



మునిసిపల్, క్రీడా శాఖ సిబ్బందిని అడ్డుకుంటున్న అక్రమణ దారులు



భువనగిరి టౌన్, జూన్ 12: క్రీడలు, క్రీడాకారులకు ఉపయోగపడాల్సిన భువనగిరి ఇండోర్ స్టేడియం విలువైన స్థలం కబ్జాకు గురవుతోంది. ఇప్పటికే కొంత స్థలం అన్యాక్రాంతం కాగా తాజాగా ఇంటి స్థలాల పేరిట పలువురు ఇండోర్ స్టేడియం ఆవరణలో హద్దులు ఏర్పాటు చేశారు. మరికొందరు ఏకంగా బేస్మెంట్లు కట్టగా మరో ఇద్దరు ఏకంగా గదులనే నిర్మించారు. కొన్ని రోజులుగా జరుగుతున్న కబ్జా తంతును గమనించిన క్రీడాకారులు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా క్రీడల శాఖ, మునిసిపల్ అధికారులు, సిబ్బంది బుధవారం కబ్జాలను తొలగించే ప్రయత్నాలు చేయగా,ఆక్రమణదారులు అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలతో ఇరువర్గాల మధ్య వాగ్వాదాలు నెలకొని కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.ఇప్పటికే స్టేడియం ప్రాంగణంలో మిషన్ భగీరథ కార్యాలయం నిర్మించగా మరోవైపు పర్యవేక్షణ లోపం కారణంగా గతంలోనే కొంత భాగం అన్యాక్రాంతమైంది. తాజాగా లోతట్టుగా ఉండే స్టేడియం వెనుక నుంచి ఏకంగా ముందుభాగంవరకు ఇంటిస్థలాల పేరిట కొద్ది మంది కబ్జాకు తెరలేపారు. అయితే స్టేడియం ప్రహరీగోడ నిర్మాణానికి రూ.32లక్షలు మంజూరైనప్పటికీ పనులు చేపట్టకపోవడంతోనే విలువైన స్థలం కబ్జాకు గురవుతోందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

27 ఏళ్ల క్రితం 3.10 ఎకరాల స్థలం కేటాయింపు

భువనగిరిలో క్రీడా సదుపాయాలను కల్పించే లక్ష్యంతో 1997లో స్థానిక బంజారా హిల్స్‌లో హుస్నాబాద్ రెవెన్యూలోని 153/3 సర్వే నెంబరులో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం 3.10ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ మేరకు సుమారు 1000 గజాల విస్తీర్ణంలో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని 1998లో 4 సెప్టెంబరు 4వ తేదీన అప్పటి లోకసభ స్పీకర్ జీఎంసీ బాలయోగి, స్థానిక శాసన సభ్యుడు, అప్పటి హోంశాఖా మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రారంభించారు. మిగులు స్థలంలో ఇతర క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని భావించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆవిర్భవించిన తొలినాళ్లలోనే స్టేడియం ఆవరణలోనే సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్మించేందుకు అప్పటి మంత్రులు జి.జగదీ‌ష్‌రెడ్డి, ఎండి.మహమూద్‌అలీ 2014 జూలైలో శంకుస్థాపన చేశారు. కానీ పలు కారణాలతో భవన నిర్మాణం వాయిదా పడింది. ఈ క్రమంలో 2019లో అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఇండోర్ స్టేడియాన్ని ఆధునీకీకరించారు. వెలుపలి భాగంలో స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, తదితర అవుట్ డోర్ క్రీడల ప్రాంగణాలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. కానీ అమలులోకి నోచుకోలేదు. కబ్జాదారులు మాత్రం స్టేడియానికి స్థలం కేటాయించిన 27 సంవత్సరాల క్రితం నుంచే కబ్జాకు ప్రయత్నాలు చేస్తూ కొద్దిమేర సఫలీకృతం అయినట్టు ప్రచారం ఉన్నది. నిరంతరాయంగా సాగుతున్న కబ్జా ప్రయత్నాలను నిలువరించేందుకు ఇండోర్ స్టేడియం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి 2021, ఫిబ్రవరి 22వ తేదీన ప్రభుత్వం రూ.32 లక్షలు కేటాయించి పనుల బాధ్యతను పంచాయితీరాజ్ శాఖకు అప్పగించింది. కానీ ప్రతిపాదిత పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో కబ్జాదారులకు అనువుగా మారింది.

కబ్జాయత్నాలు ఇలా..

పర్యవేక్షణ కొరవడిన ఇండోర్ స్టేడియం స్థలాన్ని ఇంటిస్థలాల పేరిట కబ్జా చేసేందుకు కొంత కాలంగా కొద్దిమంది ప్రయత్నాలు సాగిస్తున్నారు. కొద్దికాలం క్రితం స్టేడియం వెనుకాల వేసిన గుడిసెలను అధికారులు తొలగించారు. తాజాగా మరోమారు ముందస్తు ప్రణాళికతో ముందుగా లోతట్టుగా ఉండే వెనుక భాగంలో హద్దులను ఏర్పాటు చేసుకున్న కబ్జాదారులు బుధవారం ఉదయం నాటికి ఏకంగా స్టేడియం మరోవైపున ప్రధాన రహదారి వరకు వస్త్రాలు, కర్రలు, రాళ్లతో హద్దులను ఏర్పాటు చేసుకున్నారు.వెనుక లోతట్టు ప్రాంతంలో ఏకంగా బేసెంట్లు, రూంలను నిర్మించారు. జిల్లా క్రీడల, యువజన శాఖా అధికారి కె.ధనంజనేయులు, మునిసిపల్ టీపీఎస్ నరేష్ ఆధ్వర్యంలో సిబ్బంది కబ్జాలను తొ



లగిస్తుండగా ఆక్రమణదారులు అడ్డుకుని వాగ్వాదం చేశారు.దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది. అయితే ఆక్రమణ పర్వం వెనుక కొద్దిమంది నాయకులతోపాటు ఓస్థానిక ప్రజా ప్రతినిధి పరోక్ష హస్తాలు ఉన్నట్టు ప్రచారమవుతోంది. భువనగిరి పట్టణంలోని ఏకైక స్టేడియంగా ఉన్న ఇండోర్ స్టేడియం ఆవరణ కబ్జాకాకుండా అధికారులు, పాలకులు, నాయకులు చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

అన్యాక్రాంతం కానివ్వం

ఇండోర్ స్టేడియానికి కేటాయించిన 3.10 ఎకరాల స్థలంలో గజం భూమిని కూడా అన్యాక్రాంతం కానివ్వం. విలువైన స్థలాన్ని కాపాడి క్రీడా స్టేడియంగా అభివృద్ధి చేస్తాం. తాజా కబ్జా యత్నాలను మునిసిపల్ సిబ్బంది, క్రీడాకారులతో కలిసి గురువారం నిలువరించాం. కబ్జా యత్నాలపై కలెక్టర్‌కు నివేదికను అందజేశాం. మంజూరైన రూ.32 లక్షలతో ప్రహరీ గోడ పనులను వెంటనే చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను కోరాం.

- కే.ధనుంజనేయులు, జిల్లా క్రీడలు, యువజన శాఖా అధికారి

వారంలో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తాం

రూ.32లక్షల వ్యయంతో ఇండోర్ స్టేడియం ప్రహరీ గోడ నిర్మాణ పనులకు వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తాం. అయితే గతంలో రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినప్పటికీ నిధులు, స్థానిక పరిస్థితుల కారణంతో కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. కానీ ఇటీవలే నిధుల మంజూరు, కేటాయింపు, విడుదలపై ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చింది. కబ్జాలను తొలగిస్తే పనులు చేయదానికి కాంట్రాక్టర్లు మొగ్గు చూపే అవకాశం ఉంటుంది.

- గిరిధర్, డీఈ, పంచాయతీ రాజ్ శాఖ

నేడు మోత్కూరు సింగిల్ విండో ఛైర్మన్ ఎన్నిక

● నోటీస్ జారీ చేసిన డీసీవో

మోత్కూరు, జూన్ 12: మోత్కూరు రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ ఎన్నికను ఆగమేఘాల మీద నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మోత్కూరు రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై తొమ్మిది మంది డైరెక్టర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై డీసీవో ఈ నెల 11 (మంగళవారం)న ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ఓటింగ్ నిర్వహించారు. అవిశ్వాసానికి అనుకూలంగా తొమ్మిది మంది డైరెక్టర్లు ఓటు చేయడంతో అవిశ్వాసం నెగ్గింది. వరుసగా మూడు సమావేశాలకు హాజరుకాని ఇద్దరు డైరెక్టర్లను సహకార చట్టం ప్రకారం డైరెక్టర్ పదవుల నుంచి తొలిగించి, డీసీవోకు రిపోర్టు చేసినా డీసీవో వారికి ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించడం చట్ట విరుద్ధమని ఛైర్మన్ అశోక్‌రెడ్డి సహకార ట్రిబ్యునల్‌లో కేసువేశారు. ఓటింగ్‌ను ఈ నెల 18 వరకు నిర్వహించవద్దని ట్రిబ్యునల్ స్టే ఇచ్చినప్పటికీ, ట్రిబ్యునల్ ఆదేశాలు తనకు అందలేదంటూ డీసీవో ఓటింగ్ నిర్వహించారు. అవిశ్వాసానికి అనుకూలంగా తొమ్మిది మంది డైరెక్టర్లు ఓటు వేయడంతో అవిశ్వాసం నెగ్గిందని, అశోక్‌రెడ్డి ఛైర్మన్ పదవిని కోల్పోయారని డీసీవో ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. అవిశ్వాసం నెగ్గినందున ఛైర్మన్ పదవి కోల్పోయినట్లు తనకు నోటీస్‌గాని, ప్రొసీడింగ్ అందించలేదని అశోక్‌రెడ్డి చెబుతున్నారు.

నేడు నామినేషన్ల స్వీకరణ

ఖాళీ అయిన ఛైర్మన్ స్థానానికి ఈ నెల 13న ఎన్నిక నిర్వహించనున్నట్లు డీసీవో ప్రవీణ్‌కుమార్ ఈ నెల 12న నోటీస్ జారీ చేశారు. ఛైర్మన్ స్థానానికి ఈ నెల 13న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 12 గంటల నుంచి 12.30 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, 12.30నుంచి ఒంటి గంట వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఈ నెల 12న జారీ చేసిన నోటీస్ 495/2024-సిలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈమేరకు స్థానిక సంఘం అధికారులు డైరెక్టర్లకు ఎన్నిక సమావేశం నోటీసులు అందించారు. ఇదిలా ఉండగా అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఛైర్మన్ స్థానం ఖాళీ అయినందున వైస్‌ఛైర్మన్‌కు ఇన్‌చార్జి ఛైర్మన్ బాధ్యతలు ఇవ్వాలి తప్ప మరునాడే ఎన్నిక నిర్వహించకూడదని సహకార శాఖ నిపుణులు చెబుతున్నారు. ఛైర్మన్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు డీసీవో సహకార స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు నివేదిక ఇచ్చి ఎలక్షన్ కమిషన్ అనుమతి తీసుకుని ఛైర్మన్ ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుందని చెబుతున్నారు. డీసీవో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కాగా డీసీవో బదిలీ అయినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



కవిత(ఫైల్)

మోత్కూరు, జూన్ 12: మోత్కూరు మండల కేంద్రంలో ఓ మహిళ బావిలో పడి మృతి చెందింది. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... భువనగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని కాకినాడ బస్తీకి చెందిన మాటూరి కవిత (38) అదే పట్టణానికి చెందిన వంట మాస్టర్ నర్సింహతో కలిసి వంటలు చేయడానికి వెళుతుందంటున్నారు. బుధవారం వారిద్దరు వేములకొండలో బంధువుల చావుకు వెళ్లి, ఆ తర్వాత మోత్కూరులో తన సోదరి కొంగరి మమత ఇంటికి వచ్చి, స్నానాలు చేయడానికి మోత్కూరులో చెరువుకట్ట పక్కన ఉన్న ముత్యాలమ్మ బావి వద్దకు వెళ్లారు. అక్కడ అప్పటికే ఒరిద్దరు బావిలో ఈత కొడుతున్నారు. కవిత కూడ తనకు ఈత వస్తుందని అనడంతో, ఈత వస్తే బయట నిలబడటమెందుకు బావిలోకి దూకు అంటూ వెంట ఉన్న నర్సింహ ఆమెను తోశాడు. ఆమె పక్కనే ఉన్న మరొకామెను పట్టుకోగా బ్యాలెన్సు తప్పి ఇద్దరు మహిళలు బావిలో పడిపోయారు. కవిత నీటిలో మునిగిపోగా ఆమెతో పాటు బావిలో పడిన మరో మహిళ ఒడ్డుకు చేరుకుంది. ఆమె మునగడం చూసి నర్సింహ బావిలోకి దూకి ఆమెను బయటకు తీయడానికి యత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో అతను పరార్ అయ్యాడు. అక్కడ ఉన్న వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సుమారు రెండు గంటల పాటు శ్రమించి ఆమెను వెలికి తీయగా అప్పటికే ఆమె మృతి చెందింది. రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శవాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించి, కవిత చెల్లెలు కొంగరి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రామన్నపేట సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ ఎ.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఇంటి తలుపు తట్టి.. బంగారు గొలుసు అపహరణ

భువనగిరి టౌన్, జూన్ 12: తెల్లవారుజామున ఇంటి తలుపు తట్టి మహిళను నిద్ర లేపి ఆమె మెడలోని 22 గ్రాముల బంగారు ఆభరణాన్ని అపహరించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని కూనోజి భారతమ్మ మూడంతస్తుల ఇంటిలో కింది ఫ్లోర్ ముందు భాగాన్ని డాక్యుమెంట్ రైటర్‌కు అద్దెకు ఇచ్చి ఆమె వెనుక గదిలో ఒంటరిగా నివాసం ఉంటోంది. పై రెండు అంతస్తుల్లో ఇద్దరు కుమారులు ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఆమె నిద్రిస్తున్న గది వెలుపల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు తలుపులను బాదారు. దీంతో ఆమె ఎవరని ప్రశ్నించడంతో డాక్యుమెంటరీ కావాలని నిందితులు బదులిచ్చారు. ఈ మేరకు ఆమె స్పందిస్తూ 10 గంటల తర్వాతే డాక్యుమెంట్ రైటర్స్ వస్తారని బదులిచ్చింది. తెల్లవారుజామున నిద్రలేచే అలవాటున్న ఆమె రోజువారీగా తలుపులు తీసిన వెంటనే ముఖానికి మాస్క్ ధరించిన దుండగుడు అకస్మాత్తుగా ఆమెపై దాడి చేస్తూ ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించేందుకు ప్రయత్నించాడు. అయితే ఆమె తీవ్రంగా ప్రతిఘటిస్తూ దుండగుని మాస్కు, మెడలోని పూసల దండను తెంపింది. అయినప్పటికీ దుండగుడు ఆమె మెడలోని 22 గ్రాముల బంగారు ఆభరణాన్ని అపహరించుకుని పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం సంఘటన స్థలంలో ఆధారాలు సేకరించింది. కాగా ఆమెను కొన్ని రోజులుగా పరిశీలించిన వారే దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

వ్యర్థ రసాయనాల ట్యాంకర్ పట్టివేత

భూదాన్‌పోచంపల్లి, జూన్ 12: మండల పరిధిలోని కెమికైస్ ఇండస్ట్రీస్ పరిశ్రమ నుంచి వ్యర్థ రసాయనాలను ట్యాంకర్ ద్వారా తరలిస్తుండగా దోతిగూడెం గ్రామస్థులు బుధవారం సాయంత్రం పట్టుకుని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పీసీబీ శాస్త్రవేత్త పురుషోత్తంరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్యాంకర్ గ్రామం నుంచి తరలిస్తుండగా పట్టుకున్న గ్రామస్థులు గతంలోనూ అనేక పర్యాయాలు తాము పీసీబీ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కెమికల్ కంపెనీల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలను గాలిలోకి, భూగర్భంలోకి వదులుతున్నందు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇక్కడి కెమికల్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, అధికారులతో గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శాంపిల్స్ లేబోరేటరీకి పంపించి రిపోర్టు అనంతరం తగు చర్యలు తీసుకుంటామని పీసీబీ శాస్త్రవేత్త పురుషోత్తంరెడ్డి చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. పోలీసులు ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతి

బీబీనగర్, జూన్ 12: బీబీనగర్ మండలం లక్ష్మీదేవిగూడెం గ్రామంలో విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన జిల్కపల్లి మహేష్ అనే రైతుకు చెందిన రెండు పాడి గేదెలు గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్ద గడ్డి మేస్తుండగా మంగళవారం కురిసిన ఈదురు గాలులతో కురిసిన వర్షానికి తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.లక్షా 20వేలకు పైగా ఉంటుందని బాధిత రైతు మహేశ్ తెలిపారు.

'పర్సన్ ఇన్‌చార్జ్'ని పదవి నుంచి తొలగించాలి



ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అఖిల పక్ష నాయకులు

చౌటుప్పల్ టౌన్, జూన్ 12: చౌటుప్పల్ చేనేత సహకారం సంఘంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న పర్సన్ ఇన్ చార్జ్ కందకట్ల బిక్షపతిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు గోశిక స్వామి, గోశిక రవి, వనం ధనుంజయ్య , గుర్రం నర్సింహ, గోశిక బిక్షపతి మాట్లాడుతూ పర్సన్ ఇన్‌చార్జ్ బిక్షపతి సాగిస్తున్న అవినీతి, అక్రమాలకు అడ్డు తగులుతున్నారన్న ఉద్దేశంతోనే తన అనుచరులతో కలిసి చేనేత కార్మికులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని, ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలిపారు. 10మంది కార్మికులకు పనులు కల్పించలేని, పర్సన్ ఇన్ చార్జ్ బిక్షపతి సంఘం నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, విలువైన ఆస్తులను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. తక్షణమే బిక్షపతిని ఆ పదవి నుంచి తొలగించి కార్మికులకు న్యాయం చేయాలని వారు కోరారు. బిక్షపతి సాగిస్తున్న అవినీతి, అక్రమాల గురించి చేనేత, జౌళి శాఖ కమిషనర్‌కు విన్నవించామని వారు గుర్తు చేశారు. బిక్షపతిని పదవి నుంచి తొలగించకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని చేనేత కార్మికులు హెచ్చరించారు. అంతకు ముందు పట్టణంలో చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత నాయకులు గోశిక లక్ష్మీనర్సింహ, గోశిక పురుషోత్తం, కడవేరు పాండు, గోశిక నర్సింహ, గోశిక భాస్కర్, గోశిక నరహరి, గోశిక పూర్ణచందర్, కె.ఆనంద్, రుద్ర యాదగిరి, సుంకి రవి, జెల్లా నారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన దేశానికే ఆదర్శం



యాదగిరిగుట్టలో కేక్ కట్‌చేస్తున్న నాయకుడు బాలనర్సయ్య

యాదగిరిగుట్ట రూరల్/ చౌటుప్పల్ టౌన్, జూన్ 12: ఏపీ సీఎం నారా చంద్రబాబు పరిపాలన దేశానికే ఆదర్శమని టీడీపీ ఆలేరు నియోజకవర్గం కో కన్వీనర్ రేగు బాలనర్సయ్య అన్నారు. బుధవారం గుట్టలో చంద్రబాబు ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టీడీపీని బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ నర్సింహగౌడ్, కళ్లెం బాబురావుగౌడ్, చిత్తర్ల శ్రీనివాస్‌గౌడ్, శేషగిరిరావు, ముఖ్యర్ల శ్రీశైలం, రాజాసింగ్, శివరాత్రి కిష్టయ్య, నర్సింహ పాల్గొన్నారు.

● టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏపీని అభివృద్ధి పథంలోకి తీసుకువెళుతుందని ఆ పార్టీ మునుగోడు ఇన్‌చార్జ్ బడుగు లక్ష్మయ్య అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో టీడీపీ కార్యకర్తలు బాణసంచా కాల్చి మిఠాయిలను పంపిణీ చేశారు. దివంగత పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వర్కాల వెంకటేశ్ గౌడ్, నాయకులు నల్ల పర్వతాలు యాదవ్, కళ్లెం సత్తయ్య, టి.శ్రీను, సుంకరి జంగయ్య, శేఖర్, అశోక్, రాజు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



మోత్కూరు జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహిస్తోందని, ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. బుధవారం మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హెచ్ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య, ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి, ఎంఈవో శ్రీధర్, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మునిసిపల్ వైస్‌ఛైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్, అమ్మఆదర్శ పాఠశాల ఛైర్మన్ దబ్బెటి శైలజ. సింగిల్ విండో వైస్‌ఛైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాగా తుర్కపల్లి, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, యాదగిరిగుట్ట, వలిగొండ, భువనగిరి, రాజాపేట, గుండాల, ఆత్మకూరు(ఎం), మోటకొండూర్ మండలాల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు.

బడి గంటలు మోగిన వేళ..





బీచ్‌మహల్లా ప్రభుత్వ పాఠశాలలో బడి గంట కొడుతున్న టీచర్, చీపురు పట్టిన అటెండర్



రాజాపేట మండలంలో పిల్లలకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఆత్మకూరు(ఎం)లో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ మంగమ్మ, ఉపాధ్యాయుల



గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో పూలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న టీచర్లు

పాఠశాలల విద్యార్థులకు వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో బడిగంటలు మోగాయి. టీచర్లు విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. స్వీపర్లు లేకపోవడంతో టీచర్లు బడిగంట కొట్టగా అటెండర్లు తరగతి గదులను శుభ్రం చేశారు. మొదటి రోజు నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కొనసాగింది. ఆప్యాయంగా పలకరించుకుంటూ విద్యార్థులు కలిసి భోజనం చేశారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు అభినందన



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సన్మానిస్తున్న కాంగ్రెస్ మండల నాయకులు

బొమ్మలరామారం, జూన్ 12: ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన తీన్మార్ మల్లన్నను బుధవారం బొమ్మలరామారం మండలానికి చెందిన కాంగ్రెస్ మండల నాయకులు, మండల పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మల్లన్నను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి మల్లేశం, కాంగ్రెస్ నాయకులు మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌యాదవ్, చీర సత్యనారాయణ, ఆగంరెడ్డి, కుంటి నర్సింహయాదవ్, సీనియర్ పాత్రికేయుడు రాజ మల్లారెడ్డి, జూపల్లి బాలకృష్ణ, కృష్ణారెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా క్రాంతి

భువనగిరి టౌన్, జూన్ 12: బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా భువనగిరి పట్టణానికి చెందిన బట్టు క్రాంతి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఇటీవలి వరకు ఏబీవీపీలో వివిధ స్థాయిల్లో ఆయన పనిచేశారు. జిల్లా కార్యదర్శిగా నియమితులైన క్రాంతిని పలువురు అభినందించారు.

పోచంపల్లి బ్యాంకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి, జూన్ 12: ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నూతన కార్యవర్గానికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం నాడు నామినేషన్లను దాఖలు చేయడంతో ఎన్నికల ప్రక్రియ ఆరంభమైంది. పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, జిల్లా చేనేత నాయకులు తడక రమేష్ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల నిర్వహణాధికారి జి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ/ఎస్టీ రిజర్వుడ్ కేటగిరి డైరెక్టర్ స్థానానికి పోవానం శ్రీనివాస్, మహిళా రిజర్వుడ్ కేటగిరి రెండు స్థానాలకు కర్నాటి భార్గవి, పిల్లలమర్రి అర్చన, జనరల్ కేటగిరి డైరెక్టర్ స్థానాలకు గోలి యాదగిరి, తడక రమేష్, బోడ దయానంద్, రాపోలు జ్ఞానేశ్వర్, పిల్లలమర్రి నరేందర్ నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్ తెలిపారు.

సంక్షిప్తంగా..

వలిగొండ : మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ వినతిపత్రం అందజేశారు. ఆయన వెంటన నాయకులు మాటూరి బాలరాజు, మద్దెల రాజయ్య, సిరిపంగి స్వామి, తుర్కపల్లి సురేందర్, శ్రీశైలంరెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

వలిగొండ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి, మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ నూతి రమేష్‌రాజు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.

భూదాన్‌పోచంపల్లి : ఈ దేశంలో దోపిడీ పోవాలన్నా, ప్రజల బతుకులు మారాలన్నా, అందరికీ విద్య, వైద్యం అందించాలన్నా ఎర్ర జెండాతోనే సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. పట్టణంలో సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలోని మోడల్ స్కూల్ అండ్ కాలేజీలో ఖాళీ గా ఉన్న పోస్టులను అవర్లీ బెస్ట్ ప్యాకల్టీ నియమాకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.దీప ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ ఇన్ తెలుగు ఒక పోస్ట్, పీజీటీ కెమిస్ట్రీ ఒక పోస్ట్, పీజీటీ మాథమెటిక్స్ ఒక పోస్ట్, టీజీటీ హిందీ కి రెండు పోస్ట్ లు ఖాళీ గా ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ నెల 15 లోపుగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని పీఏసీఎస్ రూ .70.00 లక్షల లాభాలతో నడుస్తుందని ఛైర్మన్ చింతల దామోదర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.

తుర్కపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని శ్రీకృష్ణ యాదవసంఘం జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో బుధవారం మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో హైద్రాబాద్ ఇందిరా పార్కు దగ్గర ఈ నెల 15న నిర్వహించే బీసీల మహా ధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మోటకొండూర్ :మండల కేంద్రంలో ఈనెల 16, 17 తేదీల్లో జరిగే శ్రీమహాలక్ష్మి, భూలక్ష్మి సమేత బొడ్రాయి, నాభిశిల ప్రథమ వార్షికోత్సవ ఆహ్వాన శుభపత్రికను మాజీ సర్పంచ్ వడ్డేబోయిన శ్రీలత అధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతి కార్యలయం అవరణలో గ్రామస్తులతో కలిసి అవిష్కరించారు. బొడ్రాయి వేడుకల్లో గ్రామస్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.